క్లుప్తంగా

గృహనిర్మాణాలను వేగవంతం చేయండి



హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న హౌసింగ్ పీడీ సత్యనారాయణ

కరప: వివిధ దశల్లో ఉన్న గృహనిర్మాణాలను పరిశీలించి ఆయా లబ్ధిదారులను అప్రమత్తం చేసి నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని గృహనిర్మాణశాఖ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ చెప్పారు. కరప మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన ఆయా శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. 2014–19లో ఎన్‌టీఆర్ హౌసింగ్ స్కీం కింద ఇళ్లు కట్టుకుని బిల్లులు పడనివారి జాబితాను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ వై.శ్రీనివాస్, డీఈఈ కె.సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో కె.అప్పారావు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో రమణకుమార్, ఐకేపీ సీసీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన



నేత్రదానంపై వాకర్స్‌కు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా బోట్‌క్లబ్ వాకర్స్‌కు సోమవారం అవగాహన కల్పించారు. బాదం బాలకృష్ణ ఐబ్యాంక్ ఆధ్వర్యంలో ట్రస్టీలు చంద్రశేఖర్ మాట్లాడుతూ నేత్రదానంపై ఇప్పటికీ అవగాహన లేక ముందుకురావడం లేదని, ముందుగా దానిపై అవగాహన పెంచుకుని బంధువులతో పాటు స్నేహితులకు తెలియజేయాలని సూచించారు. అనంతరం కరపత్రాలు అందజేసి వారితో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఐబ్యాంక్ సిబ్బంది నాని, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలే సురక్షితం

కాకినాడ సిటీ: పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలే సురక్షితమని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో మట్టి వినాయకుడిని పూజించాలని వీబీవీఆర్ చారిటబుల్ ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి రూపొందించిన గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు, ఎంఎస్‌ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల ఎస్‌ఎంసీసి చైర్మన్ జి.సాయి నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

బోట్‌క్లబ్: ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా శ్యామ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ మొక్కల పంపిణీ చేశారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత ఫౌండర్ చైర్మన్ గుంటూరి శ్యామ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ శైలజా శ్యామ్, మాజీ కార్పొరేటర్ ఉషారాణి, రోటరీ క్లబ్ సభ్యులు వర్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

బీచ్‌లో చెత్త తొలగింపు

కాకినాడ రూరల్: సూర్యారావుపేట బీచ్‌లో చెత్త తొలగింపు కార్యక్రమాన్ని కూటమి నాయకులు చేపట్టారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం చేపట్టిన సేవా కార్యక్రమాలలో భాగంగా బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగించారు. గ్రామాలలో మొక్కలు నాటారు. బీచ్‌లో కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు బీజేపీ నాయకులు చిలుకూరి రామ్‌కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కరప: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను కరప మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. కరప బీసీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు.

జగనన్న కాలనీలో కమిషనర్ పర్యటన

సామర్లకోట: మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య సోమవారం స్థానిక జగనన్న కాలనీలో పర్యటించారు. కాలనీ వాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షం వచ్చిన సమయంలో వీధులన్నీ బురదమయంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా బురదనీరు వస్తుందని కాలనీ వాసులు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని, వాటర్ ట్యాంకరు ద్వారా నీటిని సరఫరా చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. బురదనీరు రావడానికి పైపులైన్ల లీకులు కారణంగానే ఇటువంటి సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని లీకులను గుర్తించాలని సూచించారు.

పేదల గుండె చప్పుడు వైఎస్సార్

- మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి, సీనియర్ నాయకుడు కురసాల సత్యనారాయణ
- దివంగత నేత వైఎస్సార్‌కు నివాళులు

కాకినాడ: మహానేత దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజలకు కోసం ఎన్నతో పథకాలు అమలు చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచపోయారని వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న అధ్యక్షతన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి, నాయకులు, కార్యకర్తలు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్, కొడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి వైఎస్సార్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

చిరస్మరణీయుడు వైఎస్సార్

కాకినాడ రూరల్: ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ప్రజల్లో చిరస్మరణీయుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టరు వైఎస్ రాజశేఖరరెడ్డి అని ఆయన సంక్షేమ పథకాలు ప్రజల్లో నిలిచిపోయారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కురసాల సత్యనారాయణ పేర్కొన్నారు. కాకినాడ 2వ డివిజన్ వైద్యనగర్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతిని పార్టీశ్రేణులు సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి కురసాల సత్యనారాయణ, ఎంపీపీ బందిలి విరీషా, సీనియర్ నాయకుడు రావూరి వెంకటేశ్వరరావు, సర్పంచులు బెజవాడ సత్యనారాయణ, రామదేవు, చిన్నా, పిల్లి చక్రరావు, ఎంపీటీసీలు, మహిళలు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్సార్ సేవలను కొనియాడారు. తిమ్మాపురం, వాకలపూడి, తిమ్మాపురం, సూర్యారావుపేట, పండూరు, తమ్మవరం, నేమాం, కొవ్వాడ, గంగనాపల్లి, రేపూరు, చీడిగ, ఇంద్రపాలెం తదితర గ్రామాల్లో ఆయా సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు వైఎస్సార్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



రమణయ్యపేట వైద్యనగర్‌లోని పార్టీ కార్యాలయంలో మహానేత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సత్యనారాయణ తదితరులు

తూరంగిలో వైఎస్సార్ వర్ధంతి

కాకినాడ సిటీ: తూరంగి సాయిబాబా గుడి వద్ద ఉన్న విగ్రహానికి వైఎస్ రాజశేఖరరెడ్డి వీరాభిమాని నల్లమిల్లి విశ్వనాథ్‌రెడ్డి, తూరంగి షిర్డీసాయిబాబా ఆలయ చైర్మన్ కర్రి పల్లారెడ్డి, పారుపల్లి లక్ష్మణరావు వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పేదల పెన్నిధి వైఎస్సార్

కరప: ప్రతి కుటుంబానికి మేలు చేకూరేలా సంక్షేమ పథకాలు అమలు చేసిన దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, జెడ్పీటీసీ యాళ్ళ సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, సర్పంచ్‌లు వాసంశెట్టి శ్రీనుబాబు, వాసంశెట్టి రామారావు, ఎంపీటీసీలు చక్కపల్లి ఫకీర్రావు, దేవిశెట్టి సూర్యప్రకాష్, పార్టీ నాయకులు సాదే లోహిదాస్, నక్క సత్తిబాబు, పైలా గోవిందు, అడబాల బుచ్చిబాబు, గోన శ్రీను, వజ్రపు కామేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నక్కా వీరభద్రరావు, నాగల బాలాజీ, గ్రొరెల శ్రీనివాస్, చిన్నారి, మురళీకృష్ణ నివాళులు అర్పించినవారిలో ఉన్నారు. మండల పరిధిలో గ్రామ గ్రామాన మహానేత వైఎస్సార్ వర్ధంతిని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు.



వాకలపూడిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



సూర్యారావుపేట మత్స్యకార గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మత్స్యకారులు



షిర్డీసాయిబాబా ఆలయం వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నల్లమిల్లి విశ్వనాథరెడ్డి



కరపలో వైఎస్సార్ విగ్రహానికి నివాళు లర్పిస్తున్న మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ తదితరులు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

కార్పొరేషన్ కమిషనర్ భావన

కాకినాడ: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. సోమవారం కొండయ్యపాలెం శారదమ్మ గుడి సమీపంలోని ముత్తా గోపాలకృష్ణ వారిధి వంతెన వద్ద జరిగిన వనమహోత్సవ కార్యక్రమంలో కమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ కాకినాడ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేలా కొన్ని చోట్ల ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ అందజేసిన పలు మొక్కలను ముత్తా వారధి వంతెన కింది నుంచి ఐటీఐ కళాశాల వెనుక రోడ్డులోని పార్కు వరకు నాటారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయ సంచాలకులు శిరిల్, తదితరులు పాల్గొన్నారు.



వనమహోత్సవంలో మొక్కలు నాటిన కమిషనర్ భావన

సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ వ్యతిరేకం

కాకినాడ లీగల్: ఎస్సీ,ఎస్టీ వర్గీకరణపై ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని కాకినాడ ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ ఎస్సీ,ఎస్టీ న్యాయవాదుల సోమవారం నిరసన ర్యాలీగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ వినతి పత్రం అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది కుంచే శ్రీహరి మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని, ఆర్టికల్ 341 కి వ్యతిరేకమన్నారు. న్యాయవాది జనిపల్లి వెంకట రమణ మాట్లాడుతూ తీర్పు సుప్రీం కోర్టు పునః సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ,ఎస్టీలను వర్గీకరించే అధికారం ఒక్క పార్లమెంట్‌కి తప్ప సుప్రీం కోర్టుకు లేదని న్యాయవాది టి.పృథ్వీరాజ్ పేర్కొన్నారు. ఈ నిరసన కార్యాక్రమంలో న్యాయవాదులు ఎస్.నగధర్, వి.రాజబాబు, అశోక్‌కుమార్, సత్యంమాష్టార్, వడి శ్రీనుబాబు, బి.మూలయ్య, స్వామి తదితరలు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎస్సీ,ఎస్టీ న్యాయవాదులు

పౌష్టికాహార లోపంపై అవగాహన

కొత్తపల్లి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులను వేధిస్తున్న పౌష్టికాహార లోపంపై అవగాహన కల్పించాలని సీడీపీఓ దుర్గాదేవి అన్నారు. పిఠాపురంలో ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సోమవారం పోషణ అభియాన్ రాష్ట్రీయ పోషకాహార వారోత్సవాల కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. వైద్యుడు బి.జయరామ్ మాట్లాడుతూ పౌష్టికాహార లోపం వలన అనేక సమస్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

వాహనాల వేలం

కాకినాడ క్రైం: సారా కేసుల్లో పట్టుకున్న వాహనాలకు మంగళవారం వేలం నిర్వహించనున్నట్టు కాకినాడ పోర్టు పీఎస్ సీఐ సునీల్ కుమార్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. పోర్టు పీఎస్‌లో ఉదయం 10 గంటలకు రెండు బోట్లలో పాటు ద్విచక్రవాహనాన్ని వేలం వేయనున్నట్లు తెలిపారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణపై సమీక్ష

కాకినాడ సిటీ: ప్రమాదాలను ముందుగానే పసిగట్టి, సిబ్బందిని అప్రమత్తం చేసేలా ప్రమాదకర పరిశ్రమల్లో తప్పనిసరిగా అలారం, సెన్సార్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి పరిశ్రమల ప్రతినిధులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి ఆయన జిల్లాలోని పరిశ్రమల భద్రతపై జిల్లా సంక్షోభ నివారణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న ప్రమాదకర పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలు తీరు, ప్రమాదకర రసాయనాలు తయారీ, నిల్వల వివరాలు, ప్రమాదకర సంఘటనలు వాటి కారణంగా ఆయా ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. పరిశ్రమల్లో భద్రతా ఆడిట్, ఇతర వివరాలపై ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక, ఏపీఐఐసీ, కార్మిక, వైద్య ఆరోగ్యం, పోలీస్ తదితర శాఖలతో పాటు జిల్లాలోని ప్రమాదకర పరిశ్రమల ప్రతినిధులతో ఆయన చర్చించారు. జిల్లాలో వివిధ పరిశ్రమలు భద్రతకు సంబంధించి తీసుకున్న చర్యలను డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్‌ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాధాకృష్ణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇటీవల రాష్ట్రంలో ఎన్టీఆర్, అనకాపల్లి జిల్లాల పరిశ్రమల్లో జూలై నుంచి తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు. జిల్లాలో ప్రధానంగా 14 ప్రమాదకర పరిశ్రమలను గుర్తించామని, వాటిలో అలారం, సెన్సార్ వ్యవస్థను అక్టోబర్ 15 నాటికి అమర్చాలన్నారు. ప్రమాదకర పరిశ్రమల్లో భద్రత తనిఖీలకు సంబంధించి ఆడిట్ ఇతర వివరాలను సమర్పించాలన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పరిశ్రమలను సురక్షితంగా నడపడంతో పాటు తరచుగా మాక్ డ్రిల్‌లు నిర్వహించాలన్నారు. ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో కాలుష్యనియంత్రణ మండలి జిల్లా ఈఈ ఎస్.సందీప్, ఏపీఐఐసీ జెడ్‌ఎం ఎం.రమణారెడ్డి, డీసీఐ ఏడీ కృష్ణార్జునరావు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ బుల్లిరాణి, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి ఎస్.సుబ్బారావు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్, డీఎస్పీ రఘువీర్ విష్ణు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

కాకినాడ సిటీ: ఈనెల ఏడో తేదీ నుంచి నిర్వహించే గణపతి ఉత్సావాలు ప్రజలంతా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని డీఆర్‌వో తిప్పే నాయక్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నగర గణేష్ ఉత్సవ సమితి ఆహ్వాన పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. సమితి గౌరవాధ్యక్షులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ కాకినాడ సిటీ వినాయకసాగర్, రూరల్ మండలం సూర్యారావుపేట బీచ్, చొల్లంగి కాశీరేవు ప్రాంతాల్లో నిమజ్జనాలు జరుగుతాయన్నారు. వినాయక చవితి ఉత్సవాలపై సమితి నాయకులు, పెద్దలతో దేవాలయం వీధిలోని పైడా కల్యాణ మండపంలో మంగళవారం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దువ్వూరి సుబ్రహ్మణ్యం, ఎనిమిరెడ్డి మాలకొండయ్య, రంబాల వెంకటేశ్వరరావు, సాలగ్రామ లక్ష్మీప్రసన్న, కొక్కిరిగడ్డ గంగరాజు, కర్రి పాపారావు, కవికొండల చలపతి కృష్ణారావు, సరగడ రాంబాబు తదితరు ఉన్నారు.



నగర గణేష్ ఉత్సవ సమితి ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న డీఆర్వో తిప్పేనాయక్

సొమ్ము కట్టాక.. ప్లాట్ మంజూరు కాలేదంటున్నారు..

కాకినాడ సిటీ: ప్రభుత్వ టిడ్కో ప్లాట్ ఇస్తామంటే రూ.4.65 లక్షలు కట్టానని తనకు టిడ్కో ప్లాటు మంజూరు కాలేదని, అధికారుల వద్దకు తిరుగుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదంటూ కాకినాడ 27వ డివిజన్‌కు చెందిన పిల్లి సూర్యచంద్ర కుమారి డీఆర్వో తిప్పేనాయక్‌ను కలిసి తమ గోడును వెల్లబుచ్చుకున్నారు. సోమవారం గ్రీవెన్స్ రద్దు అనే విషయం తెలియక కలెక్టరేట్‌కు వచ్చిన ఆమె విలేకరులకు తన గోడును వివరించారు. విషయాన్ని తెలుసుకున్న పౌరసంఘం నాయకులు దూసర్లపూడి రమణరాజు, యెనిమిరెడ్డి మాలకొండయ్య, రంబాల వెంకటేశ్వరరావులు సూర్యచంద్ర కుమారిని డీఆర్వో వద్దకు తీసుకెళ్లారు. ఆమె చెప్పిన విషయాన్ని విని, రికార్డులను పరిశీలించిన డీఆర్వో తిప్పేనాయక్ హౌసింగ్ బోర్డు అధికారులు మాట్లాడి సమస్య పరిష్కరించాలని, అనంతరం సమస్య పరిష్కార వివరాలను తమకు పంపాలని కోరుతూ కలెక్టరేట్ నుంచి బట్వాడా చేశారు. నాలుగు రోజులు తరువాత హౌసింగ్ అధికారిని కలుసుకోవాలని ఆమెకు డీఆర్వో వివరించారు. పదేళ్ల కాలంగా ప్లాట్ కోసం రూ.4.65 లక్షల జమ చేసి తెచ్చిన డబ్బుపై వడ్డీ చెల్లించలేక, ప్లాట్ లభించక తీవ్ర అనారోగ్యానికి గురయ్యామన్నారు. టిడ్కో ప్లాట్ కోసం డబ్బు చెల్లించిన బాధితుల కోసం ప్రత్యేక కార్యాచరణ సమావేశం నిర్వహిస్తామని రమణరాజు తెలిపారు.

మళ్లీ మునిగిన వరి చేలు



కాకినాడ రూరల్ పండూరులో నీట మునిగిన వరి చేను



తిమ్మాపురంలో ముంపులో వరిచేలు

- తుపాను ప్రభావంతో విస్తారంగా వర్షాలు
- నీట మునిగిన ఖరీఫ్ చేలు
- సాగు ప్రారంభం నుంచి రైతులకు తప్పని తిప్పలు

కాకినాడ రూరల్: అన్నదాతపై ప్రకృతి పగ పట్టిందా అన్నట్టు ఈ ఖరీఫ్‌లో రైతన్నలకు కష్టాలు తప్పడం లేదు. సాగు ప్రారంభం నుంచి రైతులకు అన్ని అడ్డంకులే ఉంటున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో గత మూడు రోజుల పాటు కురిసిన వర్షాలకు కాలువలు పొంగి ప్రవహిస్తుండగా వరి చేలు నీటి మునిగాయి. మండలంలో పండూరు, తమ్మవరం, తూరంగి, సర్పవరం తదితర గ్రామాలలో వరిచేలు ముంపునకు గురయ్యాయి. ఆదిలోనే హంసపాదు అన్నట్టు వెదజల్లు పద్ధతి చేపట్టిన వరిసాగుకు ఆగస్టులో కురిసిన వర్షాలు దెబ్బతీయడంతో చాలా మంది తిరిగి నాట్లు వేసి అదనంగా రూ.4వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు నీరు మడుల్లో నుంచి బయటకు పోవకుండా ఉండడంతో మళ్లీ పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

19,100 ఎకరాల్లో సాగు

నియోజవర్గంలో కాకినాడ రూరల్, కరప మండలాలలో సుమారు 19,100ఎకరాలు గోదావరితో పాటు ఏలేరు ఆయకట్టు కింద వరి సాగవుతున్నాయి. గోదావరి ఆయకట్టు ముందుగానే నాట్లు వేశారు. ఏలేరు కింద ఆలస్యంగా చేశారు. ఈ సీజన్‌లో ఎక్కువ మంది రైతులు ఎంటీయూ 7029(స్వర్ణ) రకం వరి వంగడం 60 శాతం ఆయకట్టులో సాగుచే పట్టగా పది శాతం బీపీటీ 5,204, మరో పది శాతం ఎంటీయూ 1318 రకం, 20శాతం ప్రైవేట్ వరి వంగడాలు సాగు చేస్తున్నారు. తుపాను కారణంగా తరచూ ముంపునకు గురవ్వడంతో ఆ ప్రభావం దిగుబడిపై పడుతుందని, తద్వారా తాము తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని రైతులు పేర్కొన్నారు.

మూడు నెలలు దాటినా..

వ్యవసాయం చేసే అన్నదాతాలకు ఆసరాగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పీఎం కిసాన్‌తో కలిపి రూ.13500 పెట్టుబడి సాయంగా ఇచ్చేవారు. కౌలు రైతులకు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం అందించేది. ఏటా మే నెలలోనే పెట్టుబడి సాయం మొదటి విడత అందించి అన్నదాతలను ఆదుకునేవారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చినా మే నుంచి మూడు నెలలు దాటినా అన్నదాతలకు పెట్టుబడి సాయం అందలేదు. తుపానులతో సావాసం చేస్తున్న అన్నదాతలు అదనపు పెట్టుబడులు పెట్టలేక అప్పులు చేస్తున్నారు. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించి ఉంటే వారిలో ధైర్యం కలిగేది.

అప్రమత్తంగా ఉండాలి



అధిక వర్షాలు కారణంగా వరిచేలు ముంపులో ఉండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలి. నీరు పోయే మార్గం ఎప్పటికప్పుడు చూసుకోవాలి. పంట నీటిలో ఉండడంతో తెగుళ్ల సోకే అవకాశం ఉంది. పండూరు, తమ్మవరం, తూరంగి, తిమ్మాపురం తదితర గ్రామాల్లో ఎక్కువ చేలు నీటిలో ఉన్నాయి.

– చీకట్ల సత్యనారాయణ, వ్యవసాయ అధికారి, కాకినాడ రూరల్

ప్రతికూల వాతావరణం



ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వాతావరణం ప్రతికూలంగా ఉంది. వెదజల్లు పద్ధతిలో చేలు దెబ్బతినడంతో మళ్లీ నాట్లు వేసిన రైతులు అదనపు పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు తుపాను ప్రభావంతో చేలు ముంపులో ఉన్నాయి. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. తక్షణం సాయం విడుదల చేయాలి.

– తుమ్మలపల్లి చంటిబాబు, రైతు, పండూరు